నిధులు ఎంత మంజూరు చేశారో అడిగితే చెప్పారా..?

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవోను నిలదీసి బయటకు వచ్చిన సభ్యులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలో 14.15 ఆర్థిక సంఘం నిధులు ఏఏ పంచాయతీకి ఎంత మొత్తంలో మంజూరు చేశారో అడిగితే చెప్పారాయని స్థానిక ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్‌కు మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామక్రిష్ణలతో పాటు కొంతమంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశాన్ని వాకౌట్‌చేసి బయటకు వచ్చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ నిధులు అన్ని పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని, ఏఏ మండలంకు ఎంత నిధులు మంజూరుచేసి ఖర్చు చేశారో వాటి పూర్తి వివరాలు ఇవ్వాలని ఎంపీడీవోను సభ్యులు అడుగగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు పంచాయతీలకు సమానంగా వాటవేయటం కుదరదని, మీ పంచాయతీలకు ఏమైన సమస్య ఉంటే గ్రామ తీర్మానం చేసి తీసుకువస్తే అప్పుడు వాటికి నిధులు మంజూరుచేస్తానని, అలాగే సమావేశం పూర్తి అయినప్పటికి పూర్తయినప్పటికీ ఏఏ పంచాయతీకి ఎంత నిధులు మంజూరు చేశామో వివరాలు ఇస్తానని అప్పటివరకు మీరంతా సమావేశంలో కూర్చోని మీమీ పంచాయతీలో సమస్యలు అధికారులను తెలియజేయాలని సభ్యులకు కోరారు. సభ్యులు మాట్లాడుతూ గడిచిన మూడు సమావేశంలో అధికారులకు సమస్యలు చెబుతున్న పరిష్కరించలేదని, ఏసమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు హజరు కావటం లేదని ఇంకా ఏ సమస్య తీర్చుతారని ఎంపీడీవో పై ధ్వజమెత్తి వైఎస్ ఎంపీపీలతోపాటు మండల విప్ బొద్దు అప్పన్న, మండల కో-అప్షన్ మెంబర్ ఎస్‌కె.రంజాన్ రాజుబాయ్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ నుంచి బయటకు వచ్చి విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీడీవో అన్ని పంచాయతీలకు మండల పరిషత్ నిధులు ఇవ్వటంలేదని, నిధులు ఎంత ఇచ్చారు, ఎంత ఖర్చు చేశారో చెప్పమంటే చెప్పనందుకు సమావేశం వాకౌట్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కాళ్ళ సంజీవరావు, నూక సత్యరాజు, బి.ఎల్లయ్య, నేతింటి అప్పలస్వామి, దుంగ శిమ్మన్న, గురువెళ్ళి కేశవరావు, గద్దవలస నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పోరు బాటలో పాల్గొంటా...

- కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కారానికై పాదయాత్ర చేస్తా...
- ప్రజా గాయకుడు గద్దర్

విశాలాంధ్ర-పలాస : జిల్లా జానపదం విప్లవ పదం కావాలని.. ప్రజా చైతన్యానికి నాంది పలకాలని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. పలాస మండలం రంగోయి గ్రామంలో నిర్వహిస్తున్న సిక్కోలు జానపద కళా జాతరలో పాల్గొనేందుకు గద్దర్ మంగళవారం పలాస వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యల పోరుబాటలో పాల్గొంటానని, ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారానికై త్వరలో పాదయాత్ర చేస్తానని అన్నారు. భారతదేశ బానిస ప్రజల విముక్తి పొందేందుకు ఎంతోమంది తమ నెత్తుర ధారబోసి నిర్మించిన ఉద్యమ మార్గం తన లక్ష్యాన్ని చేరుకోలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సమాజంపై కార్పొరేట్ శక్తులు నాలుగు రకాల యుద్ధాలు చేస్తున్నాయని, ఇందులో ప్రధానమైనది సాంస్కృతిక యుద్ధమని అన్నారు. కోట్లాది మంది శ్రమజీవుల జ్ఞాన నిక్షిప్తమైన స్మార్ట్ ఫోన్‌ను కార్పొరేట్ శక్తులు భారత దేశ యువతారాన్ని నాశనం చేసేందుకు వినియోగిస్తున్నాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో సిక్కోలు సాంస్కృతిక కళావేదిక నిర్వహకులు కళా జాతర పేరుతో సాంస్కృతిక సైన్యాన్ని తయారు చేయడం అభినందనీయమని అన్నారు. రెండేళ్ల అజ్ఞాతవాసంలో ఉన్న సమయంలో దివంగత ఉత్తరాంధ్ర ప్రజా గాయకుడు వంగపండు ప్రసాద్‌తో కలిసి ఒకే పాటను 32 భాషల్లో దేశంలో అన్ని రాష్ట్రాల్లో పర్యటించి పాట పాడి లక్షలాది మందిని ఉద్యమం వైపు కదిలించామంటూ అప్పటి జ్ఞాపకాలను వివరించారు. ఉత్తరాంధ్ర యాస, భాషతో ప్రజలను ఉర్రూతలూగించిన వంగపండుకు నోబెల్ ప్రైజ్ రావాల్సిందని అన్నారు. ఈ దేశంలో పాలకులు ఖచ్చితత్వమైన విధానంతో సజావుగా ఉన్నారని, సమాజంలో ఉన్న 90శాతం పాలితుల్లో చైతన్యం తీసుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు సిక్కోలు కళా జాతర వేదిక ద్వారా సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో వేదిక సభ్యులు కుమార్ నాయిక్, క్రిష్ణారావు, మల్లేన్న, దేవరాజులు ఉన్నారు.

సమగ్ర భూహక్కు పట్టాల పంపిణీ

విశాలాంధ్ర-బూర్జ : సమగ్ర భూహక్కులతో రైతులకు మేలు కలుగుతుందని బూర్జ వైస్.ఎంపీపీ బుడుమూరు సూర్యారావు పేర్కొన్నారు. ఏ.బీ.సీ.పేట గ్రామ రెవిన్యూ పరిధిలో ఓ.వి.పేట గ్రామానికి చెందిన 31 మంది రైతులకు మంగళవారం సమగ్ర భూహక్కు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు తమతమ ఇళ్లకు తెచ్చి ఇచ్చే ప్రభుత్వం కేవలం మన జగనన్న ప్రభుత్వం మాత్రమేనని ఆయన ప్రస్తుత్తించారు. ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, శాసనసభాపతి తమ్మినేని సీతారాంల పాలనలో రైతులు సుభిక్షంగా, సంతోషంగా వుండగలు గుతున్నారన్నారు. అనంతరం గ్రామంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దారు సనపల రమణారావు, ఓ.వి.పేట సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, ఉపసర్పంచి ప్రతినిధి ఇసాయి వెంకటరావు, ఓ.వి.పేట విఆర్వో లక్ష్మీనారాయణ, ఉప్పినివలస వీఆర్వో రాజారావు, బి.వెంకటగోవిందరావు, రైతులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఉప ఖజానా కార్యాలయానికి 'సాసుపల్లి' ఇన్వర్టర్ వితరణ

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక ఉప ఖజానా కార్యాలయానికి మంగళవారం మేజర్ పంచాయితీ ఉప సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు ఇన్వర్టర్‌తో పాటు బ్యాటరీని వితరణ చేశారు. ఉప ఖజానా కార్యాలయంలో కరెంట్ లేని సమయంలో విశ్రాంత ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సుమారు. 25వేలు విలువ చేసే ఇన్వర్టర్, బ్యాటరీ వితరణ చేశామని కృష్ణబాబు తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, సదాశివుని ప్రభాకరరావుతోపాటు ఉప ఖజానాధికారి, డి.కొండలరావుతో పాటు కార్యాలయ సిబ్బంది వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలియచేశారు.

వైసీపీ ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి కుంటుపడింది

విశాలాంధ్ర-కవిటి: వైసిపి ప్రభుత్వ పాలనతో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని కవిటి మండల టీడీపీ నాయకులు అన్నారు. ఈమేరకు మంగళవారం మండలంలోని డీజి పుట్టుగ గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిత్యవసరాల ధరలు పెంచుతూ ప్రజలను పూర్తిగా దోచుకు తింటుం దన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వెళుతున్న టిడిపి అధినేత చంద్రబాబుకు వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక చీకటి జీవోలు తీసుకురావడం విచారకరమన్నారు. ప్రజల కష్టాలు తీరాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసీఎస్ వైస్‌చైర్మన్ ఎస్ వి రమణ, టిడిపి మండల అధ్యక్షుడు మనిచంద్ర ప్రకాష్, బార్ల చిన్న బాబు, బాసుదేవ రౌలో, భీమా రౌలో,భావన నారాయణమూర్తి, తమరాల హరి, కోరాడ లక్ష్మి, రఘుపాత్రని శ్రీనివాస రావు,జల్లు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 1ను రద్దు చేయాలి

వామపక్ష పార్టీల నిరసన

విశాలాంధ్ర-పలాస: కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జిఓ నెంబర్ 1 రద్దు చేయాలని వామపక్ష నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ర్యాలీలు, సభలు, రోడ్డుషోలపై ప్రభుత్వ నిషేధం దుర్మార్గమని, జగన పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని, ఇలాంటి జిఓల కోసం కందుకూరు,గుంటూరు సంఘటనలు సాకుగా చూపడం దారుణమన్నారు, ప్రజా ఉద్యమాల అణచివేసే కుట్రలో భాగమే ఈ జిఓ అని ఆరోపించారు. వెంటనే ఈ జిఓను రద్దు చేయకుంటే ప్రజాగ్రహని గురి కాకతప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో చాపర వేణుగోపాల్, నెయ్యిల గణపతి, తామాడ సన్యాసిరావు, కూర్మారావు, యం నాగేశ్వరరావు, సిహెచ్ మురుగన్, సిహెచ్ రవి, యన్ డిల్లేశ్వరి, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- సభ్యుల ఆమోదంతో బడ్జెట్ ఆమోదం
- జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియా విజయ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియా విజయ జడ్పీ సభ్యులను కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన బడ్జెట్ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడ్జెట్ సవరణ, అంచనా బడ్జెట్ ఆమోదించిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్డబ్ల్యుఎస్ అధికారులు పైపు లైన్లు వేసినప్పుడు గోతులను పూరించాలన్నారు. రీసర్వేపై ప్రజల్లో అవగాహన పరచాలని చెప్పారు. జడ్పీకి ఆదాయం ఇచ్చే శాఖలు సకాలంలో చెల్లిస్తే అభివృద్ధి పనులకు వినియోగిస్తామన్నారు. పంచాయతీల్లో జరుగుతున్న పనులను పరిశీలించాలని సభ్యులను కోరారు. జిల్లాకు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదం కోసం బడ్జెట్ సమావేశంలో సభకు నివేదించగా జిల్లా ప్రజా పరిషత్ 2022-23 సవరణ బడ్జెట్ రూ.1757,9078,896/-లు రాబడి కాగా చెల్లింపులు రూ.1611,58,61,942/-లు మిగులు బడ్జెట్‌గా రూ.146,32,16,954/-లు కాగా 2023-24 అంచనా బడ్జెట్‌నకు సంబంధించి రూ.1877,04,59,662/-లు రాబడి కాగా రూ.1744,76,41,027/-లు ఖర్చు కాగా రూ.132,28,18,635/- మిగులు బడ్జెట్ ను 1వ స్థాయి సంఘం, బడ్జెట్ సమావేశమునకు హాజరై బడ్జెట్ ఏకగ్రీవంగా ఆమోదింపచేశారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్, జడ్పీ సీఈఓ ఆర్. వెంకట్రామన్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు, జిల్లా స్టాంపులు అండ్ రిజిస్ట్రార్ కె. మన్మధరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, పిఐయు డివిజన్ ఇఇ గిరిధర్, శ్రీకాకుళం ఆర్డబ్ల్యుఎస్ ఇఇ, జడ్పీటీసీ సభ్యులు, జిల్లా అధికారులు, జడ్పీ సూపరిం టెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన జామి శివాజీ సంక్రాంతి సందర్భంగా శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో 11 మంది పేదలకు ఒక్కొక్కరికి 1500 రూపాయలు విలువైన నిత్యవసర సరుకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కోట్ని విజయ్, బోయిన విజయ్, పెంట రత్నాకర్, జామి నాని, సిందిరి నరేష్, సంతోష్, సర్వేశ్వరరావులు పాల్గొన్నారు.

సమయపాలన పాటిస్తేనే గరిష్ట వేతనం వస్తుంది : డ్వామా పీడీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : సమయపాలన పాటించి రెండు పూటలా కనీసం 6 గంటల సమయం పని చేస్తేనే ఉపాధి హామీ పథకంలో కూలీలకు గరిష్ట వేతనం రూ. 257 లభిస్తుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జివి చిట్టి రాజు కూలీలకు తెలియజేశారు. మైలవరం మండలం పరిధిలోని భగీరథపురం పంచాయతీ పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన గరిష్ట వేతనం పొందడం ఎలా? సమయపాలన, ఉపాధి హామీ పథకం నిబంధనలపై కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కూలీలు గరిష్ట వేతనం పొందేందుకు అవసరమైన సాంకేతిక పరమైన సలహాలను ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. మండలంలో సగటు వ్యాసం మరింత పెంచేందుకు సిబ్బంది ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. వర్క్ ఫైలు, పంచాయతీ స్థాయిలో ఏడు రికార్డుల నిర్వహణ, నేమ్ బోర్డుల ఏర్పాటు, ఇతర సుపరిపాలన అంశాల పట్ల దృష్టి సారించాలని నిర్దేశించారు. మండలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సక్సెస్ స్టోరీలను తక్షణమే పంపించాలని అన్నారు. సామాజిక తనకి రికవరీపై ప్రత్యేక దృష్టిని సారించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పీడీ వెంట ఏ పి ఓ శోభారాణి, ఈసీ నారాయణమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు గంటల్లోనే బ్రిడ్జి కట్టేశారు

విశాలాంధ్ర-జలుమూరు : జిల్లాలోని జలుమూరు మండలం బసివాడ దగ్గర 5 గంటల్లోనే రైల్వే అండర్పస్ బ్రిడ్జి పూర్తి చేశారు. దాదాపు 150 మంది కార్మికులు, యంత్రాల సహాయంతో మట్టిని తీసేసి పలకలు అమర్చి పని పూర్తి చేశారు. రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. మార్చి నాటికి రోడ్డుకిరువైపులా పనులు పూర్తిచేసి అక్కడున్న పైగేటును మూసివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీ ఎన్‌వీ రమణ తెలిపారు.

యువతను మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి కిరణ్ రాయ్

విశాలాంధ్ర-కొత్తూరు : వైసీపీ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మృగ్యమని తిరుపతి నియోజ క వర్గ ఇంఛార్జి,పాతపట్నం నియజిక వర్గ పార్టీ పరిశీలకులు కిరణ్ రాయ్ అన్నారు, మంగళవారం కొత్తూరు లో యువశక్తి సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఇందుకు సంబంధించి పోస్టర్ల నుస్థానిక జనసేన నాయులు తో కలిసి అవిష్క రించారు, యువత కు ఎంతో మేలు చేస్తామన్న హామీలు తో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం యువతకు చేసిన మేలేది లేదని కిరణ్ రాయ్ అన్నారు. యువశక్తి సభ విజయవంతం చెయ్యాలి పెద్ద ఎత్తున యువత ఈ సభ కు తరలి రావాలి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో పాతపట్నం జనసేన ఇంచార్జి గెదల చైతన్య స్థానిక జనసైనకులు, డీ... జయరాజ్, ఇసై వెంకటేష్, అద్దపాక అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని

విశాలాంధ్ర-కంచిలి : ఉద్దానం ప్రాంతంలో ఆవేదన కలిగిస్తున్న కిడ్నీ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మండలంలోని తలతంపర గ్రామంలో మంగళవారం మంత్రి రజిని పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కిడ్నీ బాధితులకు 172 రకాల మందులు అందిస్తున్నమన్నారు. అలాగే డయాలసిస్ పేషెంట్లకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం సైతం అందజేయడం జరుగుతుందన్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గంలోని సోంపేట, కంచిలి ఆసుపత్రులలో బెడ్స్ సంఖ్య పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలంతా మెడికల్ పరీక్షల విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. వైద్య పరీక్షలు చేసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను ప్రారంభంలోనే తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జడ్పీ చైర్ పర్సన్ పీరియా విజయ, ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జె నివాస్, కలెక్టర్ శ్రీకేస్ లాఠ్కర్, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు నర్తు రామారావు, సర్పంచ్ జగబంధు దొలాయి, ఎంపీపీలు దేవదాస్ రెడ్డి, కడియాల ప్రకాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందసలో : ప్రజారోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మంగళవారం మండలం లోహరిబంద గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో ఆమె సమావేశం నిర్వహించి బాధితుల కష్టాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖా మంత్రి వి.రజిని, మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులు మాట్లాడుతూ గతంలో ఏప్రభుత్వం చేయని విధంగా డయాలసిస్ రోగులకు పదివేల రూపాయలు పింఛన్లు, 3,4,5 దశల్లో ఉన్నవారికి 5వేల రూపాయలు, కిడ్నీ మార్పిడి నిర్వహిం చిన బాధితులకు 5వేలు పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. కిడ్నీ రోగుల కోసం 37 రకాల మందులను ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉంచడం జరిగిందని, వీటిని కిడ్నీ రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిడ్నీ సమస్యలు పరిష్కారం కోసం పలాసలో 50 కోట్ల రూపాయలతో 200 పడకల ఆసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం నిర్మాణం జరుగుతున్నాయని, మార్చి నెలలో ఇది ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే 700 కోట్ల రూపాయలతో ఉద్దానం శుద్ధజల మంచినీటి పథకం పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎపి హెల్త్ ప్రిన్సిపల్ కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, మందస ఎంపిపి దొక్కరి దానయ్య, జెడ్పిటిసి సవర చంద్రమ్మ, మండల పార్టీ అధ్యక్షులు అగ్గున సూర్యారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు రాపాక శేషగిరి, సుమలతలు పాల్గొన్నారు. అనంతరం హరిపురం ప్రభుత్వాసుపత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు.

పలాసలో : రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని మంగళవారం పలాసలో 50 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 200 పడకల ఆసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రంను మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి నెలలో ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం కౌన్సిల్స్ సమావేశ మందిరంలో జిల్లా వైద్యశాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పలాస చేరుకున్న ఆమెను వైసీపీ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

దేశంలో ఆర్థిక అసమానతలు ఎక్కువయ్యాయి

- రాష్ట్రంలో దళితుల పరిస్థితి అధ్వాన్నం
- కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల అభ్యున్నతి
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

విశాలాంధ్ర-అరసవల్లి : పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల తో దేశం లో ఆర్థిక అసమానతలు ఎక్కువ అయ్యాయి అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. జిల్లా పర్యటన లో బాగంగా మంగళ వారం స్థానిక నాగావళి హెూటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు దేశ ప్రజలు అధిక ధరలతో విలవిల్లాడుతున్నారని, ఏమీ కొనలేని, తినలేని పరిస్థితి దాపురించింది అని వాపోయారు. దేశంలో 70 శాతం మంది ప్రజలు అప్పులు చేసి బతుకుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు శూన్యం అని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నడుస్తూ మధ్య, సామాన్య ప్రజల నడ్డి విరుసెలా ప్రభుత్వాలు పాలన ఉందన్నారు. దేశంలో, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నం గా ఉన్నాయి అన్నారు. దళితుల మీద దాడులు అధికం అయ్యాయి అని, దళితుల పరిస్థితి అధ్వాన్నం గా తయారు అయ్యింది ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించలేని పరిస్తి ఏర్పడటం దారుణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు అన్ని కూడా గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చినవే అని, వాటిని ఇప్పుడు పేరు మార్చి ఇస్తున్నారు అంతే తేడా అన్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు బతుకు కు భారంగా వెళ్లదీస్తున్నారు అని, ప్రజలకు పాలక ప్రభుత్వాలు చేసేదీ ఏమీ లేదని, రాజకీయ లబ్ది నే వారి అజెండా గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయి అన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేసిందని, కాంగ్రెస్ హయాంలో నే సమన్యాయం అని, ప్రజలు కూడా కాంగ్రెస్ పాలన ను కోరుకుంటున్నారు అని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, కాంగ్రెస్ నాయకులు సనపల అన్నజీరావు, అంబటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి : ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : అంకితభావంతో విధులు నిర్వర్తించి, ఇటు ప్రజలకు అటు పోలీసులకు సంధాన కర్తలుగా వ్యవహరించి ప్రజారక్షణకు భద్రత కృషి చేయాలని మహిళా పోలీసులకు ఎస్పీ జి.ఆర్ రాధిక సూచించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి మహిళ పోలీసులు విధివిధానాలు, ప్రజా భద్రత, రక్షణకై తీసుకోవలసిన చర్యలపై, జిల్లా ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మహిళా పోలీసులు చేయవలసిన విధివిధానాలు గురించి ఎస్పీ దిశానిర్దేశాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మీ పై ఉన్న భాధ్యతను అధికారంగా భావించకుండా నేర రహిత సమాజం కొరకు భాధ్యత భావం, క్రమశిక్షణతో పనిచేసి విధులు పట్ల అంకతభావంతో మెలగాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు సమస్యలను మానవీయ కోణంలో ప్రతి సమస్యను అర్థం చేసుకొనీ పరిష్కరించాలని తెలిపారు.మంచి పని చేయడానికి బయపడకండి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మేమున్నాము. మీరు ధైర్యంగా ముందుకు వెళ్ళండి అని ఎస్పీ భరోసా ఇచ్చారు. మనకేమి అని అనుకోకుండా అది మన సమస్యగా భావించి తోటి మహిళలకు చేదోడుగా వుండాలి. ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పరచుకుని ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని స్థానిక పోలీస్ల దృష్టికి తీసుకురవాలని, దిశ యాప్ గ్రామ, పట్టణాలలో ఉన్న మహిళలకు తెలియపరిచి క్షేత్రస్థాయిలో సైబర్ నేరాలు మహిళలపై జరుగుతున్న నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు వల్ల కలిగే దుష్ప్రభవాలు గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. అక్రమ మద్యం కల్తీ సారా అరికట్టుటట్లు కీలకపాత్ర వహించి గ్రామాల్లో ప్రతిరోజు సందర్శించి ప్రశాంతమైన వాతావరణం నెలకొనేలా ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీటిపి విటలేశ్వర్, సంబంధిత డీఎస్పీలు సీఐలు ఎస్సైలు, మహిళ పోలీసులు, వారి వారి కార్యాలయాలు,పోలీస్ స్టేషన్ నుంచి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలి : తహశీల్దార్ సరోజిని

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఆశ్రమం పాఠశా లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందించాలని తహసిల్దార్ సరోజినీ అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండలంలోని బందపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదా ర్థాల్ని అందించాలంటే పాఠశాలలోని మరుగు దొడ్లు, మెనూ నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని పాఠశాలలను అభివృద్ధి దశలో నడిపి స్తుందని, ప్రభుత్వ అందిస్తున్న అన్ని సౌకర్యాలు విద్యార్థినులకు అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్శనలో తహశీల్దార్‌తోపాటు మండల విద్యాశాఖధికారి దేవేంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లలిత, వీఆర్వో సత్యనారాయణ తదితరులున్నారు.

ఐతమ్ సివిల్ విద్యార్థులకు అద్భుత ప్రశంస

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆకరి ఏడాది సివిల్ ఇంజినీరింగ్ కోర్సు చదువుతున్న విద్యార్థులు సిహెచ్. సునందా నాయకత్వంలో ఎన్.సంధ్యా, ఎ.శ్యామలా, ఎన్.ప్రవీణ్‌లు ఈనెల 5, 6 తేదీల్లో గుంటూరు కలాం హెచ్‌ఆర్‌ఐటిలో జరిగిన నేషనల్ లెవల్ స్టూడెంట్ టెక్నోమేనేజ్మెంట్ ఫెస్టో భాగంగా ఏర్పాటు చేసిన 'సంకల్ప్ 2023'లో ఎకోఫ్రెండ్లీ సేవర్ బ్రిక్స్ తయారు చేసి మొదటి బహుమతిని కైవశం చేసుకున్నారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాలుష్యానికి హానికలిగించే వ్యర్థాలను ఉపయోగించి 7రోజుల్లో అతి తక్కువ ఖర్చుతో ప్రస్తుతం వాడుకలో ఉన్న ఎరుపు ఇటుకంటే 20శాతం దృఢమైన, తేలికైన ఇటుకను రూ.4కే విక్రయించే ఎకోఫ్రెండ్లీ సేవర్ బ్రిక్స్ తయారుచేసి న్యాయనిర్ణేతల ప్రశంసలు పొందారని డైరెక్టర్ పేర్కొన్నారు. అలాగే విశాఖ అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 7న జరిగిన మరో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టో భాగంగా 'జ్ఞాన్ 2023'లో పాల్గొని మొదటి బహుమతి పొందారన్నారు. ఈ ప్రాజెక్టుకు మెంటార్‌గా అధ్యాపకులు ఎం.సురేష్, మార్గదర్శిగా జి.డి.ఆర్. నాయుడులు వ్యవహరించారన్నారు. విద్యార్థులు అద్భుత ప్రదర్శనచేసి రెండు జాతీయస్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో పాల్గొని రెండు మొదటి బహుమతులను పొంది నగదు బహుమతిని, ప్రశంసాపత్రాలను తీసుకున్న ఐతమ్ విద్యార్థులకు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావుతోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్ఓడి డాక్టర్ పి.దినకర్, శాక్ కోఆర్డినేటర్ జె.సురేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు ప్రశంసించారు.

ఇసుక అక్రమ రవాణా

విశాలాంధ్ర-జలుమూరు : జనుమూరు పర్లం రాంప్ నందు ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. అధికారికంగా మైనింగ్ వారి అనుమతి లేకున్నా ఇసుక తవ్వకాలు ఆగడంలేదు. అధికారుల అండదండలతోని తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు విసిట్‌చేసి తాయిలాలు అందుకుంటా న్నారని లేకుంటే అనుమతిలేని ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవటం లేదని అంటున్నారు. ఇంచార్జి డిడి ఎస్.వి. రమణరావుని వివరణ అడిగితే వున్నది లేనిది పరిశీలించి చెప్తామంటున్నారు. జిల్లా అదికారిని ప్రశ్నిస్తే బిల్లు తనిఖీ చేస్తాం, పూర్తిగా మైనింగ్ వారికి సంబంధించిందని తెలియచేయటం ఆశ్చర్యం. ఉన్నతాధికారులే అక్రమాలకు ప్రోత్సహిస్తే ప్రభుత్వం ఎంత అప్రదిష్టపాలౌతుందో జిల్లా ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు గమనించాలి.

క్రీడలు మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే డా. బెందాళం

విశాలాంధ్ర-కవిటి : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈమేరకు మంగళవారం మండలంలోని బోరివంక గ్రామంలోని ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే అశోక్ చేతుల మీదుగా ప్రారంభించారు. క్రీడా పోటీలను నియోజకవర్గ జనసేన నాయకులు లొల్ల రాజేష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడాజ్యోతిని స్థానిక ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణారావు రౌలో ఇరువురు కలిసి వెలిగించారు. జాతీయ పతాకాన్ని స్థానిక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ ఆవిష్కరించారు. కబడ్డీ కోర్టును వీఆర్వో సంఘ అధ్యక్షులు వజ్జ బాలకృష్ణ ప్రారంభించారు. క్లబ్ జెండాను క్లబ్ గౌరవ అధ్యక్షులు విజయ గోపాల్ ఎగురవేశారు. అనంతరం ఎన్నారై ఆనంద్ రౌలో ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మ్యాచ్ రిఫరీల జెర్సీలను గెస్ట్ అధ్యక్షులు శంకరరావు తదితరులు ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీలకు మొత్తం 52 జట్లు ఈ పోటీల్లో ఎంట్రీలు వచ్చాయని మొత్తం మూడు రోజులు పాటు ఈ పోటీలు నిర్వహించబడుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్దానం యూత్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దీనబంధు, వెంకటేష్, గెస్ట్ సంస్థ కార్యనిర్వాహకులు కాశీ ఉదయ్, స్థానిక ఎంపీటీసీ డి సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ విజయ్ కృష్ణ, మాజీ సర్పంచ్ లక్ష్మీ కామేశ్వరరావు, ఉద్దానం యూత్ క్లబ్ సభ్యులు గ్రామ పెద్దలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

12నెలల ఏరియర్స్ వెంటనే ఇవ్వాలి

కలెక్టరేట్ వద్ద ఏపీ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ ధర్నా

విశాలాంధ్ర-శ్రీకాకుళం : సివిల్ సప్లై హమాలీల కూలీరేట్లు పెంచి మూడు మాసాలు గడుస్తున్నా నేటి వరకు జీవో ఇవ్వాలేదని, ఆ కూలీరేట్లు కూడా అమలు కావడం లేదని వెంటనే జీవోను విడుదల చేసి 12నెలల ఏరియర్స్‌ను తక్షణమే అందించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలు పరిష్కారాన్ని కోరుతూ మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జెసి కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా చిక్కాల గోవిందరావు మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో హమాలీ కుటుంబాలు కాలం వెల్లదీస్తున్నాయని, వస్తున్న కూలీ కూడా అతితక్కువ అని, ఏదో ఒకలా వచ్చినదానితోనే జీవితాన్ని గడుపుతామన్నా ఆ బకాయిలు కూడా సకాలంలో ఇవ్వకపోడంతో వారి బ్రతుకులు దుర్భరంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పండగ పూటకూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. కూలీ రేట్లు పెంచి జీవోను ఇప్పటి వరకు విడుదల చేయలేదని, దసరా బోనస్ కూడా అందించలేదని, పీఎఫ్ ఖాతా లేదనే సాకుతో కొందరు హమాలీలకు వారి బకాయిలను ఇవ్వడానికి జాప్యం చేస్తున్నారని వాపోయారు. గతంలో హమాలీలందరికీ దసరా బోనస్, బట్టలు, స్వీట్లు, బట్టల కుట్టుకూలీ ఇచ్చేవారని, గత కొన్నేళ్లుగా అవేవీ అమలు కావడంలేదని వాపోయారు. ఎవరి పీఎఫ్ ఖాతాలో ఎంత డబ్బులు ఉన్నాయో తెలియడం లేదని, తక్షణమే ఎవరి ఖాతలో ఎంత ఉందో స్లిప్‌లు ఇప్పించాలని ఆయన కోరారు. అలాగే పీఎఫ్ ఖాతా వివరాలను హమాలీలే తెలుసుకునేలా ప్రతీ ఒక్కరికీ పీఎఫ్ ఖాతా పాస్‌వర్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమస్యలపై గతంలో జిల్లా డీఎం కార్యాలయం వద్ద ధర్నా చేశామని, అయినా మా సమస్యలు పరిష్కారం కాలేదని, కూలీ డబ్బులతోనే కాలం వెల్లదీసే కూలీల బతుకుల్లో వెలుగులు నింపేందుకు అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు జిల్లా అధికారులు చొరవచూపాలని ఆయన కోరారు. సమస్య పరిష్కరించకుంటే ముమ్ముందు పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కెంబూరు శ్రీమన్నారాయణ, సూర్యారావు, ఖల్‌నాయఖ్, శ్రీను, బాలయ్య, కామరాజు, రాము, సీతయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు అవకాశం ఇవ్వాలి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అవకాశం ఇవ్వాలని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఎంపీపీ రోణంకి ఉమా మల్లేశ్వరావు, జడ్‌పీటీసీ దుబ్బ వెంకటరావుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల ఎంపీటీసీ నంబాళ రాజశేఖర్, సర్పంచ్‌లు సంపతిరావు హేమసుందరరాజు, మెట్ట సింహాచలంలు సంబందిత అధికారులను కోరారు. మండలంలో గల నిమ్మాడ, మాసా హెబ్‌పేట, తర్లిపేట, కిష్టుపురం, కస్తూరిపాడు, తిలారు, నీలంపేట పంచాయతీల పరిధిలోగల ఖరీఫులో సాగు చేసిన వరిసాగుకు సంబందించి ఇప్పటికే ఈ-క్రాప్ నమోదు ప్రాప్తికి ఈ రైతు భరోసా కేంద్రాల పరిధి దాన్యం స్వీకరణ పూర్తి అయినందున అన్‌లైన్‌లో తీసుకోవడం లేదని, ఈ విషయం పై జిల్లా కలెక్టర్‌కు నివేదకలు పంపించామని అక్కడ నుంచి అనుమతులు వచ్చిన తరువాత మళ్ళీ తీసుకుంటామని అధికారులు తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో ఎక్కడ ప్రభుత్వం పంపిణీ చేసిన సరుకులు పూర్తి స్థాయిలో పంపిణీ చేయటం లేదని, అలాగే గర్భిణీలకు మధ్యాహ్నభోజనం సెంటర్లులో పెట్టడంలేదని ఈ విషయంపై సంబందిత అధికారికి అడుదామంటే సమావేశానికి ఓ అధికారి వస్తున్నారని సభ్యులు అంగన్వాడీ సూపర్‌వైజర్‌కు నీలదిశారు. మాసాహెబ్‌పేట పంచాయతీలో ఉపాధిహామీ పీల్డ్ అసిస్టెంట్ సర్పంచ్‌కు ఏవిషయం చెప్పకుండా పనులు నిర్వహిస్తున్నాడని, వారికి నచ్చిన వారికి మేట్లు ఇచ్చి నచ్చిన వారికి పనులు కల్పిస్తున్నారని ఈ విషయం ఏపీఓ జి. హరిప్రసాద్‌కు చెప్పిన ఫలితం శూన్యమని ఎంపీడీవోకు సర్పంచ్ హేమసుందరరాజు తెలిపారు. పట్టుపురంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థలం కావాలని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మకు సర్పంచ్ అడుగగా పండగ తరువాత స్థలం చూసి ఇస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు పేడాడ వెంకటరావు, వంగు రాము, గృహనిర్మాణశాఖాదికారి రెడ్డి పాపినాయుడు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గురజాడ విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు



విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : మునసబుపేట గురజాడ విద్యాసంస్థల గాయత్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ముగ్గులతొ రంగవల్లికల పోటీలను నిర్వహించారు, గంగిరెద్దు విన్యాసాలు, బొమ్మల కొలువు, హరిదాసు పాటలు ఆశీర్వచనాలతో విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాలల అధినేత జీవి స్వామి నాయుడు భోగిమంటను వెలిగించి విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీవి స్వామి నాయుడు మాట్లాడుతూ కళాశాలలో సంక్రాంతి సంబరాలు కామర్స్ అండ్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ నిర్వహించడం స్ఫూర్తిదాయ కమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులు తమ సంస్కృతిని అర్థం చేసుకుని ఆచరించే వేదిక అవుతుందన్నారు. విద్యార్థులు తమ సంస్కృతిలో ఉన్న గొప్పతనం, కుటుంబ బాంధవ్యం, సంప్రదాయ విలువలు తెలుసుకున్నపుడు వారి వారి జీవితాలలో నిజమైన ఆనందం తెస్తుంది అన్నారు. కరస్పాండెంట్ అంబటి రంగారావు, గురజాడ సంచాలకులు గుంట్రెడ్డి సంయుక్త, ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు, విభాగాల అధిపతులు వంగా మహేష్, పొన్నాన సీతారామ నాయుడు, కెవివి.సత్యనారాయణ, బి.యి.డి వైస్ ప్రిన్సిపాల్ శాసనపూరి జగదీష్, విద్యార్థులకు తమ ప్రసంగాల ద్వార శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతొ, వివిధ జానపద సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు మరియు పండుగ వాతావరణం తీసుకురావడంలో సఫలీకృతం అయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు టి.బాలాజీ, ఎస్ మధు, పి.గీత, కే రవికుమార్, ఎన్.చిన్నబాబు, ఎన్.లక్ష్మీశ్రీకాంత్, డి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర - కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గం లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికముగా ఉన్నందున ప్రభుత్వ హెల్త్ సెంటర్లలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని కి కవిటి మండల ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, కంచిలి ఎంపీపీ దేవదాసు రెడ్డి వినతిపత్రం అందజేశారు.ఈ మేరకు సోమవారం కంచిలి మండలంలోని తలతంపర గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని పర్యటన సందర్భంగా ఆమెను కలిసి అందజేశారు. నియోజకవర్గంలో కిడ్నీ బాధితులు అధికంగా ఉన్న కారణంగా సుదూర ప్రాంతాల ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళటం వలన డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులకు లోనవు తున్నారన్నారు. సోంపేట, కవిటి డయాలసిస్ కేంద్రాలలో డయాలసిస్ బెడ్లు పెంచాలని, బెలగాం, బోరివంక, రాజపురం పీహెచ్సీలలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శం

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శనీయమని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అన్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచం నలుమూలలకూ వ్యాపింపజేసిన ఘనత వివేకానందుని సొంతమన్నారు. జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఎన్.ఎస్.ఎస్. విభాగం మరియు శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో కళాశాలలో వివేకానందుని 160వ జయంతి వేడుకలు జరిగాయి. మందపల్లి రామకృష్ణ, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్ విద్యార్థులకు వివేకానందుని జీవిత విశేషాలను తెలియజేశారు. అనంతరం స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ధనుంజయ రావు చిన్నారావు లైబ్రేరియన్ రామారావు కృష్ణమూర్తి రమేష్ సాహూ వినోద్ రాజు విజయ శ్రీనివాసరావు సంగీత అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం మెట్టూరు పంచాయతీ తోటూరు బీచ్‌లో 1982-83 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ కలయక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చనిపోయిన 11 మంది విద్యార్థులకు నివాళ్ళు అర్పించారు. విద్యార్థుల ఆటలు పాటలు పాడి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో మద్దు సత్యం, నందికేశ్వరరావు, దశరథరావు, బాలక్రిష్ణ, ఆదినారాయణ, తులసిదాస్, కోనేరు ప్రకాశ్, జామి మోహనరావులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ కె.రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో బోగి మంటలను వేసి విద్యార్థులు నృత్యాలు చేశారు. అనంతరం గంగిరెద్దులతో ఆటలాడించి హరిదాసులతో పాటలు పాడించారు. ఉత్తరాంధ్ర జానప కళాకారుడు బోనెల ఆసిరయ్య ఆలపించిన జానపద గీతాలు ఆలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు రుప్ సుందర్, గణేష్, తిరుపతి, రమణ, భాగ్యవతి, శోభారాణి, అలేఖ్య, వాణి, సంతోషి, జగదీష్‌లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరం సందర్శన

విశాలాంధ్ర - సోంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా కొర్లాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సోంపేట2 వైఎస్సార్ క్లీనిక్‌లో ప్రతి నెలా 2వ మంగళవారం 104, ఎంఎంయు సంచార వైద్య వాహనం ద్వారా సేవలను అందించడం జరుగుతుంది. ఈ మేరకు జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ అధికారి డాక్టర్ లక్ష్మి తులసీ సందర్శించి అక్కడ జరుగుతున్న వైద్య సేవలను చూసి కొనియాడారు. 104 సంచార వైద్య వాహనం ద్వారా బిపి, షుగర్, గర్భిణీ, బాలింతలు, ఇతర వ్యాధులకు తనిఖీలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందించారు.

పనులను వేగవంతం చేయాలి - విసి

విశాలాంధ్ర - ఎచ్చర్ల : బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో 35.82 కోట్ల రూపాయలతో నిర్మాణంలో ఉన్న పరిపాలన భవన పనులను వేగవంతం చేయాలని వీసి ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు అన్నారు. భవన నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. మూడు, నాలుగు నెలల్లో ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు చేపట్టాలన్నారు. వర్సిటీ నుంచి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం ఉండరాదన్నారు. రూ. 17 కోట్లతో నిర్మించిన పురుషుల వసతి గృహం దాదాపు పూర్తయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిడబ్ల్యూ ఇంజనీర్ మోహన్ కృష్ణ, అంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలమేరకు గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - జలుమూరు : మండలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని జలుమూరు మండల తెరారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నీరజ తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెల 9 మరియు 10వ తేదీలో ఆరోగ్య కేంద్రాన్ని గర్భిణీలకు వైద్య పరీక్షలు చేవదుతున్నారని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మనీషా ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొర్లాం గ్రామ సమస్యలపై ఎంపీకి వినతి

విశాలాంధ్ర - సోంపేట : మండలం కొర్లాం పంచాయతీలో గల సమస్యలపై దృష్టి సారించాలని మండలంలో పర్యటించిన ఎంపి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం ద్వారా మంగళవారం కోరారు. దీర్ఘకాలిక సమస్యలైన బారువ ఆర్ఎస్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదలకు కృషి చేయాలని, విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య నడుస్తున్న ఇంటర్‌సిటీకి హాల్టు కల్పించాలని, కొర్లాం గ్రామపరిధిలో భారతీయస్టేట్‌బ్యాంక్ శాఖను మంజూరు చేయాలని, దేవాలయ సముదాయాలున్నటువంటి కొత్త చెరువులో మెట్లు సదుపాయం కోసం ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేయాలని కోరారు.

జగన్ పాలనలో రాష్ట్రం నాశనం

విశాలాంధ్ర - సోంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ఆంధ్ర రాష్ట్రం నాశనమైందని ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని సోంపేట మండలం రాణిగాం, తాళభద్ర, సుంకిడి, విక్రంపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలి అభివృద్ధిని పట్టించుకోకుండా రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని విమర్శించారు. సామాన్యుడికి నిత్యావసర ధరలు మోయలేని భారంగా మారాయని అన్నారు. రైతాంగం పండించిన ధాన్యాన్ని నేరుగా అమ్ముకోలేక మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తప్పడం లేదని అన్నారు. ముఖ్యమంత్రికి ప్రజా సమస్యలపై పోరాడే ప్రతిపక్ష నేతలపై ఉక్కుపాదం మోపాలన్నదే లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాత్ర వేసి ప్రభుత్వం కర్కసపాలన సాగిస్తుందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అనేక కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మద్దిల నాగేశ్వరరావు, చిత్రాడ శ్రీనివాస్, సూరాడ చంద్రమోహన్, జీకేనాయుడు, చిత్రాడ శేఖర్, ఆయా గ్రామాల నేతలు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ



విశాలాంధ్ర - హిరమండలం : 70 ఏళ్ళ విశాలాంధ్ర దినపత్రిక క్యాలెండర్ ను మంగళవారం పాతపట్నం నియోజకవర్గఎమ్మెల్యే రెడ్డి శాంతి మెట్టూరు గ్రామం లో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాంతి మాట్లాడుతూ ఎంతో విలువలతో కూడిన దిన పత్రిక అని ఎన్నో ఓడుదుడు కలు ఎదుర్కొని నీతి కి మారుపేరు అని కొనియాడారు. మెట్టూరు గ్రామం లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో హిరమండలం విశాలాంధ్ర విలేకర్ బూర శ్రీనివాస్ రావు కలిసి విన్నవించి ఎమ్మెల్యే శాంతి చే ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో హిరమండలం ఎ ఎం సి చైర్మన్ గోగుల మాదవి వరప్రసాద్, హిరమండలం పిఎసి ఎస్ చైర్మన్ ఎవి సురేష్, మెట్టూరు సర్పంచ్ మేజ్జడ చక్ర పాణి, పిఎసి ఎస్ అధ్యక్షులు కొత్తూరు సూర్యనారాయణ వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర - మందస : క్రీడలతోనే ఆరోగ్యంతో పాటు మానసికొల్లాసం కలుగుతుందని పలాస నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జీ గౌతు శిరీషా అన్నారు. మంగళవారం అంబుగాం పంచాయతీ లింబుగాం, నారాయణపురం యువతకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులోనే కాకుండా క్రీడలపై యువత దృష్టిసారించాలని, క్రీడా రంగంలో మంచి భవిష్యత్ ఉందని అన్నారు. క్రీడల వలన ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బావన దుర్యోదన, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, దున్న పురుషోత్తం, ఎం.నవీన్‌కుమార్, బత్తిని కృష్ణారావు, తలగాన రాజశేఖర్, శివంగి వాసుదేవరావులు పాల్గొన్నారు.

యువశక్తితో జనసేన సత్తా చాటుదాం. వైఎస్సార్సీపీని ఇంటికి పంపుదాం

జనసేన టెక్కలి ఇంచార్జ్ కణితి కిరణ్



విశాలాంధ్ర - సంతబొమ్మాళి : యువశక్తితో జనసేన పార్టీ సత్తా చాటుతామని సత్తా వైయస్సార్ పార్టీ నాయకులకు ఇంటికి పంపుతామని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ కనితి కిరణ్ అన్నారు మంగళవారం సంతబొమ్మాళి మండలం సీతానగరం గ్రామంలో యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కణితి కిరణ్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర యువత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు కూలీల్లా వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు ఉన్నా వెనుకుబాటుతనం పోగొట్టడానికి, యువతలో చైతన్యం తెచ్చేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ యువశక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అలాగే నాయకులు కిరణ్ రాయల్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో ఉన్న వైఎస్ఆర్సీపీ మంత్రులు, నాయకులు బాగుపడ్డారే తప్ప, ప్రజలను,యువతీ యువకులను గాలికొదిలేసారని వాపోయారు. రణస్థలం లో ఈ నెల 12న జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువశక్తి సభను విజయంతం చేయాలని కోరారు. వెనుకుబాటుతనం పోగొట్టడానికి, యువతలో చైతన్యం తెచ్చేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గారు యువశక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ నెల 12 న పవన్ కళ్యాణ్ రణస్థలం వస్తున్న నేపథ్యంలో భారీ ఎత్తున యువకులు హాజరవుతున్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకురాలు అట్టడా శ్రీధర్, పెదడా త్రివేణిరావు, చిరంజీవి రెడ్డి రమేష్, హరి, నరేష్, గణపతి తదితరులు మరియు పెద్ద ఎత్తున జనసైనుకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం వైసీపీ ప్రభుత్వంతోనే సాధ్యం: పిరియా సాయిరాజ్

విశాలాంధ్ర - కవిటి : పేదల సంక్షేమం వైసీపీ ప్రభుత్వం సాధ్యమని,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారుల ఇంటి వద్దనే అందజేస్తున్నారని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మేజర్ పంచాయతీ కవిటి పరిధిలో గల గొండ్యాల పుట్టుగ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో చేపట్టారు.ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు,ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వ పాలన వ్యత్యాసాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిది కడియాల ప్రకాష్, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణారావు రౌలో, మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఎంపీటీసీ లు పూడి నీలాచలం, మానెక శంకర్ ప్రధాన్, ఎంపీటీసీ ప్రతినిది దుద్ది ధర్మారావు, వైయస్ రమణ, ఎలమంచి నీలయ్య, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో కషాయాల తయారీ



విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని ముద్దాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం నీమాస్త్రం అనే కషాయాన్ని పంటలపై పిచికారి చేయడం కోసం రైతుల తయారు చేసుకున్నారు. ఈ కషాయం పంటలపై పిచికారి చేయడం వలన పంటలో వచ్చే ఆకు ముడత మరియు చిన్న చిన్న పురుగులు నివారణ అవుతాయిని అలాగే ఈ కషాయం పంటలలో మొదటి దశగా పిచికారి చేయడం వలన పురుగులు తెగుల్లు రాకుండా ఉంటాయి మరియు ఈ కషాయం తయారీలో కేవలం వేపాకులు ఆవు పేడ, మూత్రం ఉపయోగిస్తాము కనుక రైతులకు ఏ విధమైనటువంటి ఖర్చు ఉండదని అందువలన ఈ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పంటలకు పెట్టుబడులు చాలా తగ్గుతాయని అలాగే నేలను చాలా సారవంతంగా చేయవచ్చని సిబ్బంది అరుణ, ధనలక్ష్మి రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో అప్పల నరసయ్య, రైతులు పాల్గొన్నారు.

మరోసారి పిఏసీఎస్ చైర్మన్ పదవి చింతాడకే?

విశాలాంధ్ర - కొత్తూరు : రైతులకు సంబంధించి వివిధ పథకాల అమలులో కీలకంగా ఉన్న పిఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మన్ పదవీ మరోసారి ప్రస్తుత చైర్మన్ చింతాడా సూర్యనారాయణకు నామినేట్ చేయాలన్న నిర్ణ యానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం,

ఇందుకు సంబంధించి ప్రతి పాదనలు ను ఆమే టెక్కలి సహకార శాఖ డిఆర్‌కు పంపించినట్లు తెలిసింది ఈ పిఏసీఎస్‌లకు ఎన్నికలు జరగనందున గత రెండేళ్లుగా స్థానిక ఎమ్మెల్యేల సూచనలతో ప్రభుత్వం ప్రతీ ఆరునెలలకు నామినేటెడ్ కమిటి (త్రిమెన్ కమిటీ)ని నీయమిస్తుంది. ప్రస్తుత మున్న కమిటి కాలపరిమితి ఈనెల జనవరి 3తేదీతో ముగుస్తుంది. కొత్తూరు పిఏసీఎస్‌కు ప్రస్తుతం చైర్మన్‌గా చింతాడా సూర్యనారాయణ, డైరెక్టర్‌లుగా కుంచాల నూకరాజు, గార రాజులు నాయుడు లు త్రిమెన్ కమిటీ గా ఉన్నారు. మరోసారి ఈకమిటీ నే నామినేట్ చెయ్యాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక నిర్ణ యనికి వచ్చినట్లు సమాచారం. కాగా ఇప్పటికే రెండు పర్యాయాలు చింతాడా ను చైర్మన్ గా కొనసాగించారు ఈ సారి మెజారిటీ సామాజిక వర్గానికి చెందిన వారికి కమిటీ చైర్మన్‌గా ఇవ్వాలని వైసీపీ లోని ఒక వర్గం ఎమ్మెల్యే శాంతిపై వత్తిడి తెస్తున్నట్లు తెలిసింది, ఇప్పటికే పాత కమిటీ లను కొనసాగించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఎమ్మెల్యే శాంతి వత్తిడి తో తన నిర్ణయాన్ని మార్చు కుంటారా? మార్పులు చేర్పులు ఉంటాయా? అన్న విషయం ఈ నెలాఖరులోగా తెలియాల్సి వుంది.

సత్యవరం వ్యాయామ ఉపాధ్యాయులు 'ఆనంద్' ప్రతిభ

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని సత్యవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, టి.ఆనంద్ క్రీడల్లో తన ప్రతిభ కనబర్చారు. గత డిసెంబర్ 15వ తేదీ నుండి 17వ తేదీ వరకూ నెల్లూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో ఆనంద్ లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతిగా సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే ట్రిపుల్ జంప్‌లో తృతీయ బహుమతిగా బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జె.కృష్ణంరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆనంద్‌ను ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఆనంద్‌కు అభినందనలు తెలియచేశారు. జాతీయ స్థాయిలో వచ్చే ఫిబ్రవరి, 13వ తేదీ నుండి 17వ తేదీ వరకూ కలకత్తాలో నిర్వహించే క్రీడా పోటీల్లో ఆనంద్ పాల్గొంటారని హెచ్.ఎం, కృష్ణంరాజు తెలిపారు.

ఉద్యోగ విరమణ హోంగార్డు ఆర్థిక చేయూత

ఒక్క రోజు గౌరవ వేతనం నగదు చెక్కును అందజేసిన ఎస్పీ రాధిక

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఉద్యోగ విరమణ పొందిన హెూమ్ గార్డు నకు జిల్లా హెూమ్ గార్డులు ఒక్క రోజు సమకూర్చిన గౌరవ వేతనం చెక్కును ఆర్థిక సహాయం గా కె ఎన్ అప్పారావు నకు ఎస్పీ జి ఆర్ రాధిక అందజేసినారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా హెూంగార్డు విభాగనాకి చెంది, శ్రీకాకుళం యూనిట్ నందు విధులు నిర్వర్తించి పదవి విరమణ చేసిన హెూంగార్డ్ కె ఎన్ అప్పారావు నకు జిల్లాలోని హెూంగార్డులు ఆర్థిక సహాయంగా విరాళంగా ఇచ్చిన ఒక రోజు వేతనం రూ.4.32 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీమతి జి.ఆర్.రాధిక చేతులు మీదుగా అందజేశారు. ఆరోగ్యం దృష్టి పెట్టాలని ఆమె అన్నారు. ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళల మీకు తోడుగా ఉంటుందని బారోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టిపి విటలేశ్వర్, డిఎస్పీ డి. ప్రకాష్, ఆర్.ఐ.బి. ప్రేదిప,హెూంగార్డు కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోండి



విశాలాంధ్ర - కంచిలి : తలతంపర పంచాయతీకి సంబంధించిన స్మశాన వాటిక ప్రహరి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ కేష్ లఠకర్ ను టిడిపి ఎస్సీ సెల్ కార్యదర్శి మర్రిపాటి పూర్ణచంద్రరావు కోరారు. మంగళవారం గ్రామానికి వచ్చిన కలెక్టర్ ను పూర్ణ కలిశారు. ఈ సందర్భంగా స్మశానిక వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వేనెంబర్ 32-4 లో ఉన్న స్మశాన వాటిక స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని, పరిశీలన చేసి సరిహద్దులు నిర్ణయించి, ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐటియ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలి



విశాలాంధ్ర - పలాస : ఈ నెల 18వ తేదీన బెంగుళూరులో జరిగే ఆలిండియా సిఐటీయు మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి కోరారు. మంగళవారం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలను నికరంగా వ్యతిరేకిస్తూ కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక సంఘం సిఐటియు అని అన్నారు. ఈ నెల 18న బెంగుళూరులో జరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వై.యజ్ఞ, ఎస్.శ్రీలత, పి.తులసమ్మ, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థి

జిల్లా విద్యాశాఖఅధికారి గార పగడాలమ్మ



విశాలాంధ్ర - టెక్కలి : ఉపాధ్యాయవృత్తి సమాజానికి అంకితం చేయాలని, ఉపాధ్యాయుడు నిత్యవిధ్యార్తిగా మారాలని శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి గార పగడాలమ్మ అన్నారు. నౌపడ ఆర్ఎస్ ఇజ్జువరం లో పి.బి.దేవి బిఈడి కళాశాల 2020-22 బిఈడి బ్యాజ్ విద్యార్థుల వీడ్కోల సమావేశంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో వస్తున్న మార్పుల్ని ఉపాధ్యాయులు పరిశీలించాలని,బోధనా మెళుకువలతో విద్యార్థులకు బోధన చేయాలని ఆమె హితవు పలికారు.ఉపాధ్యాయ శిక్షణ రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదని, వారు ఏ వృత్తిలో ఉన్నా ప్రథములుగా రాణిస్తారని పగడాలమ్మ అభిప్రాయపద్దారు. కోవిడ్ విషఫలితంవల్ల విద్యార్థులకు సెల్ఫోన్ వ్యసనం తప్పనిసరిగా మారిందని, సెల్‌ఫోన్ శృతి మించిన వినియోగంతో అది అష్టమ వ్యసనంగా తయారయిందని పేడాడ విద్యాసంస్థల చైర్మన్ పేడాడ వరమేశ్వరరావు అన్నారు. విద్యార్థుల కదలికల్ని గమనించడం ఉపాధ్యాయుని బాధ్యత అని ఆయన సృష్టించేసారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వానపల్లి భోగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంతబొమ్మాళి, టెక్కలి మండల విద్యాధికారులు జె. చిన్నవాడు, నాగభూషణం డైరెక్టర్ ఏ.సి.హెచ్ ఆజాద్, ప్రణవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రుక్మాంగధరరావు,శ్రీ విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామారావు, ఎస్.కృష్ణరావు, ఎం.అప్పన్న, ఎం.ప్రమీలరాణి, పి.సుజాత, జి.జ్యోతి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బి.యడి విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మహిళా సంఘాల నిర్వాహణపై సభ్యులకు శిక్షణ



విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : మండల మహిళా సమైక్య శ్రీకాకుళం ఆఫీసులో సెర్ప్ ఆఫీసు నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గ్రామ సంఘాల ఓబి మెంబర్స్ కు మంగళవారం ట్రైనింగ్ నిర్వహించారు. ఈ ట్రైనింగ్ లో గ్రామ సంఘాల ఓబి మెంబర్స్‌కు విధులు, బాధ్యతలు, పుస్తక నిర్వహణ ప్రతినెల సక్రంగా జరిపించాలని సూచించారు. సంఘాల గ్రేడింగ్ గురించి, సంఘాల మొబైల్ బుకింగ్ గురించి, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సంఘ సభ్యులు తీసుకున్న అన్ని రకాల అప్పులు రికవరీలు కూడా ప్రతి నెల 100శాతం ఉండాలని, సభ్యులు తీసుకున్న అప్పుల ద్వారా జీవనోపాదులు పెంపొందించుకోవాలని, ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. సంఘం సమావేశాలు ప్రతినెల సక్రమంగా జరిపించుకోవాలనే విషయాలను ఈ శిక్షణ లో గ్రామ సంఘాల ఓబి మెంబర్స్‌కు వివరించారు. ఈ శిక్షణకి మండల సమైక్య ఓబీలు, ఏపీఎం, సీసీలు, అకౌంటెంట్, ఆపరేటర్ హాజరయ్యారు.

వివేకానందుని జీవితం ఆదర్శం కావాలి : వక్తలు



విశాలాంధ్ర - ఎచ్చెర్ల : స్వామి వివేకానందుని జీవితం అందరికీ ఆదర్శం కావాలని పలువురు వక్తలు అభిప్రాయపద్దారు. సోమవారం ఎచ్చెర్లలోని గిరిజా ముక్కంటేశ్వర దేవాలయం ఆవరణలో ఆలయ పురోహితులు పెంట సంతోష్‌కుమార్ అధ్యక్షతన యువజనోత్సవాల్లో భాగంగా సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 159వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నేత నడికుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ స్వామి వివేకానందుడు సమాజం పట్ల కనబరిచిన బాధ్యతను ప్రతీ ఒక్కరూ గుర్తించి సమాజ సేవలో పాల్గొనాలన్నారు. మన దేశం విశ్వగురువని, హైందవ మతం పరమత సహనం పాటిస్తుంది, సామాజిక జాగ్రుతి లో వివేకానంద వంటి వారు నభూతో నభవిష్యతి అని, వారి జీవితచరిత్ర వారు నిర్వహించే సామాజిక కార్యక్రమాలకు మార్గదర్శనం అని మాతృభూమి సేవలో పునీతులైనవారి స్మరించడం, సామాజిక సమరసత వేదిక లక్ష్యం అన్నారు. పుణ్యం కోసం కాదు సామాజిక హితం కోసం అతని ప్రయత్నం అని చెపుతూ, శ్రద్ధ శక్తుల గొప్పతనాన్ని, వివేకానంద జీవిత విశేష ఘట్టాలను సామాజిక సమరసత వేదిక విభాగ్ సంఘ యోజక్ పెంట హఠకేశ్వర్, జిల్లా కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పందిరి రామస్వామి, వైస్ ఎంపిపి జరుగుళ్ల విజయ శంకరరావు, సర్పంచ్ ప్రతినిధి తండ్యాన లక్ష్మణరావు, ఎంపిటిసి ప్రతినిధి దన్నాన ఎల్లయ్య, ఎస్‌విఎస్ పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌పివి రమణ, ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పివిఎల్ నారాయణరావులు వక్తలుగా మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు పెంట రామారావు, ఆనంద్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్ కిరణ్, శ్రీధర్, కోటి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలి



విశాలాంధ్ర - కాశీబుగ్గ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యొక్క దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు కోరారు. మంగళవారం పలాస తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీలు మాట్లాడుతూ కనీస 26 వేలు రూపాయలు వేతనాలు ఇవ్వాలని, ఫేషియల్ యాప్ రద్దు చేయాలని, పని చేసే టాబ్‌లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, పింఛన్లు ఇవ్వాలని, ఆయాలకు ప్రమోట్ చేయాలని, మిని వర్కర్లకు మెయిన్ వర్కర్స్ జీతం చెల్లించాలని, సూపర్ వైజర్ల పోస్టుల భర్తీకి వయో పరిమితి సడలించాలని వినతిలో కోరామని తెలిపారు. కార్యక్రమంలో కె.జ్యోతి, కె.బి.ఇందుమతి, జె.శైలజ, బి.స్వాతి, మేరీ, నీలవేణి, పి.పద్మావతిలు పాల్గొన్నారు.